ఈ-పంటతో ప్రయోజనాలెన్నో

- ముమ్మరంగా ఈ-పంట నమోదు
- వచ్చే నెల 15తో ముగియనున్న గడువు
- ఖరీఫ్ రైతులకు తప్పనిసరి



పి.మల్లవరంలో ఈ-పంట నమోదు చేస్తున్న గ్రామ వ్యవసాయశాఖ అధికారి

తాళ్లరేవు: రైతులు సాగుచేసిన పంటల రక్షణ కోసం ఈ-పంట విధానాన్ని గత ప్రభుత్వం వ్యవసాయ శాఖద్వారా తీసుకువచ్చింది. ప్రభుత్వం రైతులకు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుకోవాలంటే ఈ పంటలో తప్పనిసరిగా సాగు వివరాలు నమోదు చేసుకోవాలి. ఈ-పంట నమోదు చేయించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్క రైతుపై ఉంది. దీని ద్వారా విత్తు నుంచి మొదలు ధాన్యాన్ని మార్కెట్‌లో విక్రయించే వరకు అన్ని రకాలుగా ఆసరాగా నిలుస్తుంది. పంట నష్ట పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, భీమా తదితర సౌకర్యాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పొందేందుకు ఈ-క్రాప్ విధానం ఎంతగానో ఉపయోగపడుతుంది. గతంలో ఉన్న విధానంలో వ్యవసాయశాఖ స్వల్ప మార్పులు చేసింది. గతంలో మాదిరిగానే ఈ ఏడాది ఈ-పంట నమోదులో జియోఫెన్సింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు.

నమోదు ఇలా...

రైతులు నేరుగా గ్రామ సచివాలయ పరిధిలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి సాగుచేసిన పంట, విస్తీర్ణం, సర్వే నంబర్, ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ నంబర్ వివరాలతో నమోదు చేయించుకోవాలి. ఆధార్‌తో రైతుల వివరాలను యాప్‌లో ఎంటర్ చేస్తారు. వివరాలను నమోదు చేసిన అనంతరం క్షేత్రస్థాయిలో రైతు పొలం వద్ద ఫోటోను అప్‌లోడ్ చేయగానే రైతు వివరాలు ఈ-పంటలో నమోదవుతాయి. గ్రామ వ్యవసాయ సహాయకులు, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది గ్రామాలకు వెళ్లి ఎవరు ఏ పంట సాగు చేసారన్న విషయంపై సమగ్రంగా నమోదు చేస్తున్నారు. వ్యవసాయ ఉద్యాన పంటలైన పండ్లు కూరగాయల తోటలు ఇలా ప్రతీ ఒక పంట నమోదు చేస్తున్నారు. ఫలితంగా పంటల నమోదులో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ-క్రాప్ విధానం పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పంటల నమోదు ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు జిల్లా ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు తనిఖీల్లో పాల్గొంటున్నారు.

ప్రయోజనాలు

ప్రభుత్వం అమలుచేసే ప్రతీ పథకం, కార్యక్రమం ఈ-పంట మీదనే ఆధారపడి ఉంటుంది. ఈ-క్రాప్ నమోదైతే బ్యాంకుల ద్వారా సులువుగా పంట రుణాలు పొందే వీలుంటుంది. ఇన్‌పుట్ రాయితీ, పంటబీమా, సున్నా వడ్డీకే పంట రుణాలు తదితర ప్రయోజనాలను పొందవచ్చు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు ఏయే పంటలు దెబ్బతిన్నాయో స్పష్టంగా తెలియడంతో నష్టపోయిన పంటకు పరిహారం పొందవచ్చు. ధరల పతన సమయంలో కనీస మద్దతు ధరతో వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించుకునే అవకాశం ఉంటుంది. ఎరువులు యాంత్రీకరణ పరికరాలు తదితర పథకాలతో రైతులకు ప్రయోజనం కలుగుతుంది.

> **సద్వినియోగం చేసుకోవాలి**
>
> ఈ-పంటలో ప్రతీ రైతు తమ వివరాలను పక్కాగా నమోదు చేసుకోవాలి. రైతు సేవాకేంద్రాల ద్వారా సిబ్బంది నమోదు చేస్తారు. దీని ఆధారంగానే రైతులకు అందాల్సిన రాయితీలు అందుతాయి. ఈ నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా యంత్రాంగం పర్యవేక్షణ చేస్తుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.
>
> – **ప్రశాంతి**, వ్యవసాయశాఖ అధికారి, తాళ్లరేవు మండలం

క్లుప్తంగా

పాఠశాలకు మోటార్ బహూకరణ



పాఠశాల సిబ్బందికి మోటార్‌ను బహూకరిస్తున్న నాయకులు

తాళ్లరేవు: మండల పరిధిలోని సుంకరపాలెం ప్రభుత్వ పాఠశాలలో విద్యుత్ మోటరు లేక విద్యార్థుల తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఈ మేరకు గ్రామానికి చెందిన పలువురు సమస్యను తీర్చేందుకుగాను దాతల సహకరంతో ముందుకు వచ్చారు. బుధవారం విద్యుత్ మోటార్‌ను స్థానిక నాయకులు పాఠశాల సిబ్బందికి అందించారు. సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు, నాయకులు గుంటముక్కల సూరిబాబు, సుంకర రామచంద్రరావు, కొమ్మిరెడ్డి బద్రి, మర్రి అశోక్, గుంటముక్కల విష్ణు, సిబ్బంది అలీషా, సునీల్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం



సచివాలయ ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచ్‌లు తదితరులు

అమలాపురం రూరల్: మండలంలో తాండవపల్లి గ్రామ సచివాలయంలో పనిచేసి సాధారణ బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులను సర్పంచ్ గంగుమళ్ళ యేసుబాబు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఉద్యోగుల ఉత్తమ సేవలను పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు, ఇమ్మిడివరప్పాడు సర్పంచ్ రేలంగి దుర్గారావు, మాజీ సర్పంచ్ పరమట శరత్ బాబు, మాజీ ఎంపీటీసీ కై రం సత్తిబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు నంద్యాల దొరబాబు, ఉప సర్పంచ్ గుత్తాల సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ గుమ్మళ్ల సురేష్, కైరం రాము, రంకిరెడ్డి శ్రీను, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పరమట శ్రీను, కార్యదర్శి సాధనాల విజయ దుర్గ, పాలకవర్గ సభ్యులు, పాల్గొన్నారు.

24న రక్తదాన శిబిరం



బ్రహ్మకుమారి శ్రీదేవి

అమలాపురం టౌన్: స్థానిక బ్రహ్మ కుమారి రాజయోగ మెడిటేషన్ సెంటర్ (ఓం శాంతి కేంద్రం) ఆధ్వర్యంలో స్థానిక రవణం వీధిలోని హార్మోని హౌస్‌లో ఈనెల 24న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఓం శాంతి కేంద్రం ఇన్‌చార్జి బ్రహ్మకుమారి శ్రీదేవి తెలిపారు. ఆ రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రక్తదాన శిబిరం కొనసాగుతుందన్నారు. విశ్వ బంధుత్వ దినం సందర్భంగా 24న ఈ మహత్తర కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరంలో పాల్గొనే ఆసక్తి ఉన్నవారు 9390322543 ఫోన్ నంబరులో సంప్రదించాలని బ్రహ్మకుమారి శ్రీదేవి విజ్ఞప్తి చేశారు.

నిరుపేదలకు రోజూ అల్పాహారం



మానసిక దివ్యాంగులకు అల్పాహారం అందిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: నిరుపేదలకు రోజూ ఉదయాన్నే అల్పాహారం అందించి ఆకలి తీర్చే అమలాపురం గంగాధర్ ఫ్రెండ్స్ సర్కిల్ ప్రతినిధి గోటేటి లక్ష్మి గత ఏడేళ్లుగా అందిస్తున్న సేవలు అభినందనీయమని మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి అన్నారు. మహిళా వాకర్స్ క్లబ్ కార్యదర్శిగా గంగాధర్ ఫ్రెండ్స్ సర్కిల్ ద్వారా గోటేటి లక్ష్మి అందిస్తున్న సేవల్లో భాగంగా స్థానిక హరి మనో వికాస కేంద్రంలోని మానసిక దివ్యాంగులకు ఆమె బుధవారం ఉదయం అల్పాహారం అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు అనంతలక్ష్మి మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ నినాదంతో తన వంతుగా అల్పాహారంతో ఆకలి తీర్చుతున్న గోటేటి లక్ష్మి సేవలను ఆమె కొనియాడారు. కార్యక్రమంలో గంగాధర్ ఫ్రెండ్స్ సర్కిల్ ప్రతినిధులు లోకేష్, కుమార్, రత్నంతో పాటు మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐ.పోలవరం: విద్యుత్ వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం 33/11 కెవి సబ్ స్టేషన్‌ల పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు బుధవారం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాంబాబు తెలిపారు. చెట్లల కొమ్మలు తొలగింపు, ఇతర మరమ్మత్తులు నిమిత్తం మండలంలోని అన్ని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

ఆక్రమణలు తొలగించాలని రైతుల ఆందోళన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కోనసీమ రైతులు

అమలాపురం రూరల్: రెండు మొగలు మూసుకుపోవడంతో పొలాల్లోని ముంపు నీరు సముద్రంలోకి దిగడం లేదంటూ రైతులు బుధవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. సుమారు మూడు వేల ఎకరాల పత్ర భూముల్లో రెండు వేల ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయన్నారు. వివరాల్లోకి వెళితే.. కొత్తపేట, పి.గన్నవరం, అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని సుమారు 1.20 లక్షల ఎకరాల సాగుభూమి ఉంది. ఇవి ఏటా వర్షాలు, వరదల కారణంగా ముంపునకు గురవుతోంది. దీనికి ప్రధాన కారణం రామేశ్వరం మొగ, కూనవరం మొగ మధ్యలో ఉన్న సుమారు ప్రభుత్వ భూముల్లో 2 వేల ఎకరాలు ఆక్రమణలకు గురికావడమే. అక్కడ రొయ్యల చెరువులు తవ్వడం వలన ముంపు నీరు సముద్రంలో కలవడానికి ప్రధాన అడ్డంకిగా మారింది. ఈ రెండు మొగల ద్వారా కూనవరం, అయినాపురం, వాసాల తిప్ప, అమలాపురం మేజర్ డ్రెయిన్లు, కుమ్మరి కాలువ, దేశీకోడు అప్పర్ కౌశిక, లోయర్ కౌశిక, పంచాందరి డ్రైన్ ద్వారా ముంపునీరు కిందకు వెళుతుంది. కాగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ మహేష్‌కుమార్ హామీ ఇచ్చారు.

ఆన్‌లైన్‌తో పూర్తి పారదర్శక సేవలు



తాళ్లరేవు సొసైటీ కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతున్న తుమ్మల బాబు

తాళ్లరేవు: సహకార పరపతి సంఘాలలో సేవలన్నింటినీ ఆన్‌లైన్ చేయడం ద్వారా రైతులకు పూర్తిపారదర్శక సేవలు అందనున్నాయని డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు తెలిపారు. బుధవారం ఆయన తాళ్లరేవు సహకార పరపతి సంఘాన్ని సందర్శించారు. ఇటీవల సొసైటీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన విల్ల ఆదినారాయణను అభినందించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో 295 సొసైటీలకు గానూ సుమారు 7 వేల కోట్ల టర్నోవర్ చేస్తున్నట్లు వెల్లడించారు. సుమారు రూ.1,600 కోట్ల పైబడి డిపాజిట్‌లు, రూ.700 కోట్లు బంగారంపై రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. పలు సొసైటీల్లో గతంలో కొన్ని తప్పులు జరిగాయని, ఆ కారణంగా సేవలన్నింటినీ ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ ధూళిపూడి మోహన్, నాయకులు మోపూరి రెడ్డినాయుడు, ఉంగరాల వెంకటేశ్వరరావు, రోళ్ల చక్రవర్తి, కొప్పిశెట్టి బాబి, వెంకన్న, వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు రద్దు చేయాలి



విజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న జిల్లా మాలమహానాడు నాయకులు

అమలాపురం రూరల్: 2014–18 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ కార్పొరేషన్ ఎన్ఎస్ఎఫ్‌డీసీ ద్వారా షెడ్యూల్డ్ కులాలు తీసుకున్న రూ.5 లక్షల వరకు ఉన్న అన్ని రుణాలను రద్దు చేసి వారిని రుణ విముక్తి చేయాలని జిల్లా మాలమహానాడు నాయకులు రాష్ట్ర మాల సంక్షేమ సహకార సంఘం అధ్యక్షుడు పెదపూడి విజయ్‌కుమార్‌ను కోరారు. అమలాపురం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం విజయకుమార్ సంఘ ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలను డైరెక్టర్లు చెల్లి అశోక్‌కుమార్, మద్దా మణి, కొల్లాబత్తుల అప్పారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి స్వీకరించారు. అధ్యక్షుడు జల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు విజయ్‌కుమార్‌ను కలసి వినతిపత్రం అందించారు. 2019–20లో వచ్చిన కోవిడ్ మహమ్మారి కారణంగా చాలా మంది వ్యాపారాలు పూర్తిగా నాశనమయ్యాయన్నారు. వారిలో ఎవరూ ఇప్పుడు రుణాలు తిరిగి చెల్లించే స్థితిలో లేరని తెలిపారు. కార్యక్రమంలో నూకపెయ్యి చిన్న, నాగారపు నాగరాజు, మట్టా సత్తిబాబు, మెండి డేవిడ్ అంబేడ్కర్, ముత్తాబత్తుల సత్యనారాయణ, దేవరపల్లి వీరేష్‌కుమార్, బూసి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

బాలికలపై నేరాల సంఖ్య పెరిగిపోతోంది

అమలాపురం రూరల్: రాష్టంలో 18 సంవత్సరాల లోపు మైనర్ బాలికలపై నేరాల సంఖ్య పెరిగిపోతుందని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీఎస్ అశోక్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. అమలాపురంలోని క్షత్రియ కళ్యాణ మండపంలో స్నేహిత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు కుంచె స్వర్ణలత ఆధ్వర్యంలో మహిళలు, బాలికల చట్టాలపై జరిగిన అవగాహన సదస్సులో డీఐజీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ఓఎన్‌జీసీ సాయంతో మహిళల సైబర్ భద్రత, ఇతర నేరాలపై అవగాహన కోసం ఏర్పాటు చేసిన జన జాగృతి రథాన్ని డీఐజీ ఆవిష్కరించారు. డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సదస్సులో డీఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ చిన్నారులపై లైంగిక దాడుల సంఖ్య రోజురోజుకి పెరుగుతున్నాయని వీటిని తగ్గించేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రస్తుతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాఠశాలలు, కళాశాలలు జరుగుతున్న నేరాలపై అమ్మాయిలకు అవగాహన వుండాలన్నారు. మహిళలు, పిల్లలపై జరిగే అకృత్యాలపై మహిళలకు పిల్లలకు అవగాహన ఉండాలని చెప్పడం ద్వారాగా కాకుండా చూడడం ద్వారా ఎక్కువగా గ్రహిస్తారని జన జాగృతి రథం ద్వారా జిల్లాలో నలుమూలల ముఖ్యమైన కూడళ్లలో జాతర్లు, ఉత్సవాలు సమయంలో రద్దీ ప్రదేశాలలో మహిళలపై అకృత్యాల అవగాహన కల్పిస్తూ వీడియోలను ప్రదర్శిస్తామన్నారు. ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులని బట్టి నేరం జరిగిన తర్వాత తీసుకునే చర్యలు కన్నా నేరాలు జరగకుండా ప్రజలు జాగ్రత్త పడవలసిన అవసరం ఉందన్నారు. జిల్లా అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, రామచంద్రాపురం డీఎస్పీ బి.రఘువీర్, ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, ఓఎన్జీసీ రాజమహేంద్రవరం సెక్యూరిటీ ఇన్‌చార్జి కులదీప్ సింగ్, టౌన్, రూరల్ సీఐలు వీరబాబు, ప్రశాంత్‌కుమార్, ఎస్సైలు కిషోర్ కుమార్, గంగాభవాని, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు అథారిటీ ప్రకటన

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-సి, బి(నాన్‌గెజిటెడ్) పోస్టులకు సంబంధించి ప్రత్యక్ష నియామకం కోసం పుదుచ్చేరి ఎగ్జామినేషన్ అథారిటీ ఏర్పాటు, వివిధ రాత పరీక్షల సిలబస్ తదితర వాటి గురించి బుధవారం పరిపాల నా సంస్కరణల విభాగం అండర్ సెక్రటరీ జయశంకర్ నోటిఫికేషన్ జారీచేశారు. ఎగ్జామినేషన్ అథారిటీ ద్వారా నియామకాలు చేస్తారని ఇందులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్‌పర్సన్‌గా, ఆర్థిక కార్యదర్శి, వ్యక్తిగత ప్రభుత్వ కార్యదర్శిలు సభ్యులుగా, సెక్రటరీస్థాయి అధికారి పరీక్షల నియంత్రణ అధికారిగా ప్రభుత్వం నామినేట్ చేసిన డిప్యూటీ, అండర్ సెక్రటరీ సభ్యుడు-కార్యదర్శిగా ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సరస్వతీదేవి విగ్రహ ఆవిష్కరణ

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ లక్ష్మీపతిపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో గ్రామానికి చెందిన దాత అంగాడి తాతారావు తన తండ్రి కన్నయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన సరస్వతీ దేవి విగ్రహాన్ని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు. బుధవారం స్కూల్ చైర్మన్ శివయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై విగ్రహ దాత దంపతులను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టిల్లపూడి నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి జెవి రమణమ్మ, ఎంఈఓలు పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ నిహారిక

కాట్రేనికోన: కందికుప్ప జెడ్పీహెచ్ పాఠశాల ఆట స్థలాన్ని మెరక చేసేందుకు వాడిన పూడిక మట్టిలో గాజు సీసా పెంకులు, ఎముకలు ఉన్నాయని, చిన్నారుల జీవితాలతో ఆటలు ఆడటం మంచిది కాదని తక్షణమే ఆ మట్టిని తొలగించాలని జెడ్పీటీసీ నేల కిషోర్ కుమార్ డిమాండ్ చేశారు. కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ కోలా సత్యవతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ మేరకు బాల్య వివాహాలపై ప్రజా ప్రతి నిధులు అధికారులు ప్రత్యే దృష్టి సారించి బాలల సంరక్షణ కమిటీలకు సహకరించాలని ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ముదునూరి నిహారిక హితవు పలికారు. చిన్నారులు చెడు పోవడానికి తల్లిదండ్రులు కొంత మేరకు కారణమని, అన్నం తినడం లేదని మొబైల్ ఫోన్స్ పిల్లలకు ఇచ్చి గోరు ముద్దలు తినిపిస్తున్నారన్నారు. కాట్రేనికోన సర్పంచి గంటి వెంకట సుధాకర్ మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్సు షెల్టరు ప్రయాణికులకు ఎంత మాత్రం ఉపయోగం లేదని, షాపులు అద్దెతో ఆర్టీసీకి మాత్రమే లబ్ధిచేకూరతుందని ఆరోపించారు. ముంపు నీరు దిగే మార్గం లేక రైతులు వలస పోతున్నారని, కూనవరం మొగ ఉప్పు నీటితో మండలంలోని 4 వేల ఎకరాలకు నష్టం వాటిల్లుతుందని ఎంపీటీసీ సభ్యులు సానబోయిన నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. రాఘవులపేట నుంచి గచ్చకాయల పోర వంతెన వరకు ముంపు నీరు పంట చేలకు రాకుండా రక్షణ గట్టు పనులు చేపట్టాలని, కూనవరం డ్రైన్ నుంచి పత్రభూమిలోనికి వంతెన సమీపంలో ఇసుకమేటలు తొలగించి డ్రైన్ తవ్వాలన్నారు. ఎరువులు లేక ఇతర ప్రాంతాలకు వెళ్లి రైతులు కొనుగోలు చేయవలసి వస్తుందని సభ్యులు ఆరోపించారు. గోదావరికి వరద నీరు ఉధృతి అధికంగా ఉందని, మురమళ్ల -పల్లంకుర్రు ఏటిగట్టు కుండలేశ్వరం వద్ద గట్టు బలహీనంగా ఉందని, వాహనాలు రాకపోకలు చేయరాదని బోర్డు పెట్టినా పట్టించుకోవడం లేదని తహసీల్దార్ సుబ్బలక్ష్మి వాపోయారు. ఈ సమావేశంలో సర్పంచులు మల్లాడి వీరబాబ్జి, నాతి అలివేణి, ఎంపీటీసీ సభ్యులు గిడ్డి తిరుపతి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ వెంకటాచలం, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్రమణ్యం, అంగన్‌వాడీ సూపర్ వైజర్ తులసి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకటేశ్వరరావు మృతి



వెంకటేశ్వరరావు పాడె మోస్తున్న కోఆర్డినేటర్ శ్రీకాంత్ తదితరులు

అల్లవరం: వైఎస్సార్ సీపీ దేవగుప్తం గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు (దడేల్) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా అనారోగ్యంలో బాధపడుతూ పేరూరులోని సాయి విశ్వాస్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ మృతి చెందారు. వెంకటేశ్వరరావు భౌతికకాయాన్ని నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, మాజీ ఎంపీ చింతా అనురాధ మృతిదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. పార్టీ పతాకాన్ని వెంకటేశ్వరరావు మృతదేహంపై కప్పి నివాళి అర్పించారు. ఎంపీపీ ఇళ్ల శేష గిరిరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు బాపూజీ, సర్పంచ్ సర్పంచ్ సాధనాల వెంకటరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కుడుపూడి సూర్య ప్రకాష్, సీనియర్ పార్టీ నాయకులు సంతాపం తెలిపారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి



ఎస్.యానాం రవ్వ ప్లాంట్ వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం: ఎస్.యానం గ్రామంలో వేదాంత ఆయిల్ కంపెనీ గ్రామ ప్రజలపై నిర్లక్ష్యం వహిస్తుందని నిరుద్యోగులకు ఉపాధి కల్పించకుండా, గ్రామాన్ని అభివృద్ధి చేయకుండా చేస్తున్న అలసత్వానికి నిరసనగా బుధవారం రవ్వ ప్లాంట్ బంద్ నిర్వహించి కార్మికులను ప్లాంట్లకు వెళ్లనీయకుండా అడ్డుకొని తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. గతంలో అనేక సందర్భాల్లోఅధికారుల సమక్షంలో గ్రామ ప్రజలకు వేదాంత అధికారులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకుండా వాటిని తుంగలో తొక్కి గ్రామస్తులను మోసం చేస్తుందని ఆరోపించారు. గ్రామంలో ఉన్న నిరుద్యోగులకు ఉపాధి కల్పించకుండా ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను దిగుమతి చేసుకుంటున్నారని దీని వలన గ్రామంలో ఉపాధి లేక నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వేదాంత అధికారులు గ్రామస్తుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే విధంగా ప్రభుత్వ అధికారుల సమక్షంలో చర్చల జరపాలని గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ పరిపాలన అధికారి సోమన్‌దేవ్ ఆందోళన చేస్తున్న గ్రామస్తుల వద్దకు వచ్చి అమలాపురం ఆర్డీవో మాధవి, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనంద రావుతో మాట్లాడారు. ఈనెల 28న వేదాంత ఉన్నత స్థాయి అధికారులు ఎమ్మెల్యే ప్రభుత్వ అధికారుల సమక్షంలో చర్చలు జరిపి ఎస్.యానం గ్రామస్తుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో అయితాబత్తుల రాజశేఖరరావు, తిరుపతిరావు, దంగేటి చిట్టిబాబు, పులిశెట్టి దొరబాబు, లంకే భీమరాజు, పలచోళ్ళ పద్మనాభం, కాండ్రేగుల ఏడుకొండలు, ఉండ్రు సామ్యూల్, రేవు రాజేష్, ఉడుం కిషోర్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

గోదావరి ఉధృతితో లంకవాసుల భయాందోళన



మురమళ్లలో నీట మునిగిన వరిచేలు

ఐ.పోలవరం: గోదావరి వరద పెరగడంతో మండల పరిధిలోని లంక ప్రాంత వాసులను ఆందోళనకు గురిచేస్తోంది. వరదల వల్ల ముురుగునీటి కాలువలోని ముంపునీరు దిగే అవకాశం లేకపోవడంతో చేలు ముంపుబారిన పడుతున్నాయి. మండలంలోని మురమళ్ల డ్రెయిన్‌పై షటర్లు దెబ్బతినడంతో నీరు ఎగదన్ని సుమారు 300 ఎకరాలలో వరద నీరు చేరింది. నాట్లు వేసి ఇంకా నెల రోజులు కూడా కాకుండానే చేలల్లో వరద నీరు పెద్ద ఎత్తున చేరడంతో పంట దెబ్బతింటోందని రైతులు వాపోతున్నారు. వరద ఉధృతి పెరగడంతో మండలంలోని జి.మూలపాలెం-గుత్తినదీవి మధ్య పడవల మీద రాకపోకలు నిలిపివేశారు.

22న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ఐ.పోలవరం: నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఏసీ, ఈవో వి.సత్యనారాయణ బుధవారం తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లే మాస శివరాత్రి రోజున లక్ష రుద్రాక్ష పూజ విశేషంగా జరుగుతుందన్నారు. ఈ నెల 22వ ఆఖరి శ్రావణ శుక్రవారం రోజున ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే వినతి పత్రం

యానాం: నియోజకవర్గ పరిధిలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం రాజ్‌నివాస్‌లో ఎల్జీ కె. కైలాశనాథన్‌కు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ వినతిపత్రం అందజేశారు. రెండు నెలల క్రితం పుదుచ్చేరి ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 5తో ఎస్సీలు నష్టపోతున్నారని దానిని పునఃపరిశీలన చేయాలని కోరారు. ఇప్పటికే సదరు జీఓపై యానాం రీజియన్ నుంచి దళితులు పుదుచ్చేరిలో నిరసన తెలియజేశారన్నారు. ఈ సమస్యపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని తెలిపారు. విధినిర్వహణలో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాల్లో ఒకరికి కారుణ్య నియామకాలు చేయాలని కోరారు. పీడబ్ల్యూయూడీ శాఖలో పనిచేస్తున్న సుమారు 27 మంది సిబ్బందిని 2005లో రెగ్యులర్ చేశారని అయితే 2017 నుంచి వారికి స్టెప్పింగ్ ఆఫ్ పే ఇవ్వలేదన్నారు.

అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

అమలాపురం టౌన్: అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణ, రోడ్లపై పశువుల సంచారం నియంత్రణ, నీటి పన్నుల వసూళ్ల తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు, వార్డు సచివాలయాల కార్యదర్శులతో బుధవారం సమీక్షించారు. అమలాపురం పట్టణంలో ఉన్న అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఎల్ఆర్ఎస్ స్కీంను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు. పట్టణంలోని రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న ఆవుల యాజమానులను గుర్తించి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకునేందుకు జాబితా తయారు చేయాలని సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. నీటి పన్నుల వసూళ్లను మరింతవేగవంతం చేయాలని మున్సిపల్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. పన్నుల వసూళ్ల శాతాన్ని మరింత పెంచాలని చెప్పారు. సమీక్షలో మేనేజర్ డి.ప్రభాకరరావు, డీఈఈ కె.సత్యనారాయణ, పట్టణ ప్రణాళిక అధికారి బి.రాణి సంయుక్త, ఏఈలు వి.కృష్ణ, డీఎస్ భాస్కర్, కె.వెంకటేష్‌తో పాటు 15 వార్డు సచివాలయాల కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలు, వరదలపై ప్రత్యేక దృష్టి సారించాలి



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

ముమ్మిడివరం: భారీ వర్షాలు, గోదావరి వరదల నేపథ్యంలో ఏటిగట్లు, అక్విడెక్ట్‌లు పటిష్టతపై ప్రత్యేక దృష్టి సారించాలని జలవనరులశాఖ ఇంజినీర్లను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం మండలంలోని అన్నంపల్లి అక్విడెక్ట్ వరద స్టోరేజ్‌రూమ్‌ను సందర్శించి ఇసుక బస్తాలు, ఇతర మెటీరియల్ నిల్వలను పరిశీలించారు. వరదల సమయంలో ప్రతీ అధికారి అప్రమత్తతతో వ్యవహరిస్తూ ఎక్కడా ఎటువంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు, పాటించాలన్నారు. స్థానికంగా అక్విడెక్టుల పటిష్టతపై పరిశీలనలో గమనించిన అంశాలపై పలు ఆదేశాలు జారీచేసి వాటిని కూడా బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, ప్రత్యేక అధికారి జిల్లా నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకుడు ఎస్.మధుసూధనరావు, జలవనరుల శాఖ ఇంజినీర్లు వెంకటేశ్వరరావు, మల్లికార్జునరావు తహసీల్దార్ సుభాష్ పాల్గొన్నారు.

31న డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగ రాత పరీక్ష

యానాం: పుదుచ్చేరి, మాహే, కారైకల్, యానాం రీజియన్‌లలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న డిప్యూటీ తహసీల్దార్ పోస్టుల కోసం ఈ నెల 31న ఆదివారం రాతపరీక్ష నిర్వహిస్తున్నట్లు డీపీఅండ్ ఆర్ (ఎగ్జామ్ సెల్) అండర్ సెక్రటరీ వి.జయశంకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగు రీజియన్‌లలో మొత్తం 101 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను ఈ నెల 21నుంచి 'రిక్రూట్‌మెంట్.పివై.జిఒవి.ఇన్' వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. వివరాలకు 0413-2233338కు ఫోన్ చేయాలని సూచించారు.

కన్నబాబుకు ఎమ్మెల్సీ పరామర్శ



కన్నబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

అమలాపురం టౌన్: పితృ వియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబును ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ బుధవారం పరామర్శించారు. కాకినాడలోని కన్నబాబు ఇంటికి ఎమ్మెల్సీ వెళ్లి ఆయనకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌తో పాటు రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, అమలాపురం మున్సిపాలిటీ పార్టీ పరిశీలకుడు వేగిరాజు సాయిరాజు, కర్రి సతీష్, భీమనపల్లి సూరిబాబు తదితరులు కన్నబాబును పరామర్శించారు.